క్లుప్తంగా

శ్మశాన వాటిక రోడ్డుకు మోక్షం



కోనేటిపురం(భట్టిప్రోలు): కోనేటిపురం దళితవాడ శ్మశాన వాటికకు సరైన మార్గం లేక పోవడంతో అంత్యక్రియల సమయంలో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కాలనీ వాసులు సమస్యను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రోడ్డు పనులకు ఆదేశించారు. దీంతో మొక్కలు తొలగించి, మట్టి, ఇటుక మరుమును తోలించి జేసీబీతో చదును చేయించారు. సమస్యను పరిష్కరించిన మంత్రి నాగార్జునకు సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. పనులను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), వార్డు సభ్యులు బుస్సా వెంకట్రావు, పార్టీ నాయకులు నాగబాబు, గోపాలరావులు పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణ

రేపల్లె: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణ కోరారు. పట్టణంలో తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో పర్యావరణ హిత జీవనశైలిపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. జీవానికి గాలి, నీరు ఎంతో అవసరమని వీటిని పరిరక్షించటం బాధ్యతగా తీసుకోవాలన్నారు. మొక్కలు నాటటంతో పాటు వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం



నిజాంపట్నం: గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ మంటలు చెలరేగి గడ్డితో సహా కాలిపోయిన ఘటన చింకపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. స్థానిక రైతులు చింకపాలెం సమీపంలో వరిగడ్డిని కొనుగోలు చేసి, ట్రాక్టర్ ద్వారా నిజాంపట్నం వైపుగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి ఒక్కసారిగా వరిగడ్డికి మంటలు అంటుకున్నాయి. ట్రాక్టర్‌ను డ్రైవర్ ట్రాక్టర్‌ను పక్కనే ఉన్న పొలాల్లోనికి పోనిచ్చాడు. అయితే అప్పటికే మంటలు భారీగా ఎగసిపడటంతో గడ్డితోపాటు ట్రాక్టర్ ఇంజిన్, ట్రక్కు మంటల్లో కాలిపోయాయి. అయితే ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్లు సమాచారం.

స్పందనకు నాలుగు అర్జీలు



రేపల్లె: సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో అర్జీలను ఆయన స్వీకరించారు. స్పందనకు నాలుగు అర్జీలు అందాయని తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న పంటకు నష్ట పరిహారం ఇప్పించాలని, ధాన్యం అమ్మిన రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని, టిడ్కో ఇళ్లు రద్దు చేసి, జగనన్న కాలనీలో నివేశన స్థలం ఇప్పించాలని, ఎండోమెంట్ భూములను ఆన్‌లైన్ చేయాలని అర్జీలు అందాయన్నారు. అర్జీలను పరిశీలించి, పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ వార్షికోత్సవాలు



కొల్లూరు: ఆవులవారిపాలెంలో పురాతన ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా నూతనంగా నిర్మించిన ఆలయ 11వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. సీతా, రామ, లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులను భక్తులు దర్శించుకున్నారు. అన్నదానం చేశారు.

రైతు క్షేమమే..రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి మేరుగ నాగార్జున



లబ్ధిదారులకు కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

చినపరిమి(వేమూరు): రైతు క్షేమమే..రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలం చినపరిమి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మంత్రి మేరుగ నాగార్జున ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు వేయించాలని గ్రామస్తులు అయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం నిధులు కేటాయించిన వెంటనే నియోజకవర్గంలో రోడ్లు వేస్తామని మంత్రి గ్రామస్తులకు చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకొని రావాలని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ రైతుల పక్షపాతి అన్నారు. పుష్కలంగా ఎరువులు, విత్తనాలు నిల్వ చేయడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం రైతులను పట్టించు కోలేదని విమర్శించారు. వ్యవసాయం దండగా అన్న నారా చంద్రబాబు నాయుడు రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టడం చాలా సిగ్గు చేటుగా ఉందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, ఏఎంసీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ మేరుగ సుభాషిణి, అవుతు సాయిబాబరెడ్డి, తమ్మా బసివిరెడ్డి, తమ్మా పాములరెడ్డి, అవుతు శివ పార్వతి రెడ్డి, పమిడికొండల రాజేష్‌రెడ్డి, అళ్ల సత్య నారాయణరెడ్డి, కొల్లి వెంకటరెడ్డి, కుదేటి కృష్ణ మోహన్‌రెడ్డి, పులివర్తి మోషే, వుయ్యూరి భాస్కర్‌రెడ్డి, ఏసుబాబు, మర్రిరెడ్డి బసివిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గాదె శివరామకృష్ణారెడ్డి, వుయ్యూరి అప్పిరెడ్డి, పందిపాటి ఏసు, అమర్తలూరు ప్రవీణ్, ఈపూరు బాబురావు, అలపర్తి రవి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

చండూరు మండలంలోని చిన పరిమి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు గాదె శివరామ కృష్ణా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి మేరగు నాగార్జున పాల్గొంటారని పేర్కొన్నారు.

200 పని దినాలు కల్పించాలి



భట్టిప్రోలు: ఉపాధి కూలీలకు ఏడాదిలో 200ల రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి టి. కృష్ణమోహన్ కోరారు. సోమవారం ఓలేరు తూర్పుపాలెం, పెద పులివర్రు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ ఒడిశా, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో మాదిరిగా రోజుకు రూ.600లు కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు మండల సీఐటీయూ కార్యదర్శి జి. సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మురుగుడు సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూదరులకు జైలు శిక్ష

తెనాలిరూరల్: పేకాట ఆడుతూ పోలీసులను చిక్కి.. ఆపై కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తులకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. గతేడాది జూన్ 23న కఠెవరంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించగా జూదరులు పట్టుబడ్డారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు లంకే అజయ్‌కుమార్, కొండ లక్ష్మీనారాయణ కోర్టుకు హాజరు కాకుండా, పోలీసులను తప్పించుకు తిరుగుతున్నారు. వీరిని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు గుర్తించి అదుపులోకి తీసుకుని సోమవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి పి. రాజశేఖర్ నిందితులకు ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించగా పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

దస్తావేజులు పోయినవి

బాపట్ల జిల్లా బాపట్ల మండలం సరాలశెట్టివారి పాలెం డోర్ నెంబర్ 19-3-73 కాపురస్తుడు లేట్ కాలసాని కృష్ణారెడ్డి గారి కుమారుడు కాలసాని వెంకట శివారెడ్డి నకు సంబంధించిన గుంటూరు జిల్లా, గుంటూరు పట్టణం, కొరిటిపాడు, కరణంగారి వీధి, డోర్ నెంబర్ 4-8-102/4 ను గా చ.గ 200 లు లో నిర్మించిన ఆర్.సి.సి దాబా సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెంబర్ 3151/ 1982 ఒరిజినల్ డాక్యుమెంట్స్ ది.15-5-2023 బాపట్ల పాత బస్టాండ్ సెంటర్ నుండి జెరాక్స్ తీసుకొనుటకు వెళుచుండగా దారి మధ్యలో పోయినవి కావున ఎవరికైనా దొరికిన యెడల బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ వారికి గాని ఈ క్రింది నెంబర్‌కి గాని తెలియజేయగలరు. 9493442287

సీఎం ఆశయ సాధన దిశగా పనిచేయాలి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



నగదు చెక్కు అందజేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నివేసన స్థలం అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు ఆదేశించారు. పట్టణంలోని తన చాంబర్‌లో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం జగనన్న ఆదేశాల మేరకు ఇప్పటికే అర్హులందరికీ నివేసన స్థలాలు అందించటం జరిగిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యన సమయంలో వచ్చిన అర్జీలు ఇచ్చిన అర్హులను గుర్తించి, నివేసన స్థలాలు అందించేలా అధికారులు పనిచేయాలన్నారు. స్థల సేకరణ అంశాలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పట్టణంలోని జగనన్న కాలనీలో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీలను త్వరితగతిన అందించాలని తెలిపారు. గృహాలు నిర్మించుకోని లబ్ధిదారులను చైతన్య పరచాలని చెప్పారు. సమావేశంలో ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

రేపల్లె రూరల్: ఆరోగ్యశ్రీ పరిధిలో లేని, వ్యాధుల బారిన పడి నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నగదు చెక్కులను అందజేశారు. ఇసుకపల్లికి చెందిన కర్రా రమేష్‌కు రూ.35వేలు, గంగడిపాలేనికి చెందిన ఉప్పాల లక్ష్మీరమ్యకు రూ.1.20లక్షలు, పట్టణానికి చెందిన షేక్ ఆషాకు రూ.65వేల చెక్కును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జీడిమామిడితో మహిళలకు ఉపాధి



ఉత్పత్తుల తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు

బాపట్ల: బాపట్ల జీడి మామిడి పరిశోధన స్థానంలో జీడి మామిడి పండుతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. జీడిమామిడి పండుతో విటమిన్-సి లభిస్తుందని తెలిపారు. మహిళలు శిక్షణ తీసుకుని ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సౌజన్య, నాగేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

కోర్టు ఉద్యోగి ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: తెనాలి బాలాజీరావుపేటలో నివసిస్తున్న గుంటూరు కోర్టు ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. బాలాజీరావుపేటకు చెందిన పాలమూరి కృష్ణకిషోర్ గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో పని చేస్తుంటారు. ఇక్కడ అద్దె ఇంట్లో కుటుంబంతో ఉంటూ.. ప్రతి రోజూ విధులకు వెళ్లి వస్తుంటారు. నెల 27న శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి, కుటుంబంతో కలసి ఊరు వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి యజమాని కృష్ణకిషోర్‌కు ఫోన్ చేసి, అద్దెకు ఉండే పోర్షను తలుపులు తీసి ఉన్నాయని చెప్పారు. కృష్ణకిషోర్ వచ్చి చూడగా ఇంట్లో బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. వెంటనే త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిశీలించారు. తలుపు గొళ్లెం చాకచక్యంగా తొలగించి, లోనికి ప్రవేశించిన దుండగులు బీరువాలో ఉన్న 20 సవర్ల బంగారు ఆభరణాలు, పావుకిలో వెండి వస్తువులు, రూ. 70 వేల నగదును అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. చోరీకి గురైన సొత్తు విలువ రూ. 2.70 లక్షలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి



వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, స్థానిక నాయకులు

పిట్టలవానిపాలెం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శప్రాయమని బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి అన్నారు. పిట్టలవానిపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన వలంటీర్‌కు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. సీఎం మానస పుత్రిక వలంటీర్ వ్యవస్థ అని కొనియాడారు. గత ప్రభుత్వంలో అవ్వా తాతలకు 60 ఏళ్లు దాటినా పింఛను మంజూరయ్యే పరిస్థితి లేదని గుర్తుచేశారు. నేడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇతరత్రా సేవలను వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి అందించడం హర్షణీయమన్నారు. కోవిడ్ మహమ్మారి కారణంగా ఇంట్లో నుంచి బయటకు రాలేని సమయంలో సొంత బంధువులే పట్టించుకోలేదని, అలాంటి స్థితిలో వలంటీర్‌లు ఇంటి వద్దకు వచ్చి సేవలందించారని కొనియాడారు. అనంతరం అవార్డులు అందుకున్న వలంటీర్లకు శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్ బాజి, బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, గ్రామ సర్పంచ్ బొలగాని అరుణకుమారి, సుబ్బారావు, వైస్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, జెడ్పీటీసీ సభ్యురాలు సురేఖ విజయ్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ రాష్ట ఎస్సీ సెల్ కన్వీనర్ మండే విజయ్ కుమార్, పార్టీ నాయకులు వాలి శివారెడ్డి, చేబ్రోలు వీరయ్య, చేబ్రోలు రవికుమార్, శ్యామల నాగిరెడ్డి, దబ్బుకూటి మాధవరావు, మునీర్, ఎంపీటీసీలు కరీమున్నీసా, పులుగు శ్రీనివాసరెడ్డి, మన్నెం శివకేశవులు, పారె ధనుంజయ యాదవ్, కుంతం ప్రసన్న రాజు, బోరుగడ్డ ఆదాం,యోహాను, కోటిరెడ్డి, గుమ్మడి సీతయ్య, ఎంపీడీఓ పద్మజ, తహసీల్దారు కవిత ఉన్నారు.

2న శివాజీ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర

తెనాలి: ఛత్రపతి శివాజీ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర జూన్ 2న పట్టణంలో నిర్వహించనున్నారు. స్థానిక సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి సాయంత్రం 4 గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభించి, పట్టణంలో కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. శోభాయాత్ర విజయవంతం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. శివాజీ స్మారక సమితి అధ్యక్షుడు మైలా హరికృష్ణ, సభ్యులు మంచాల రత్నరాజు, దుర్గారావు, లక్ష్మీనారాయణ, రామిశెట్టి గోపి, మణికంఠ, హరివెంకట్, తరుణ్ గోపి, బసవయ్య పాల్గొన్నారు.

రైస్ మిల్లర్‌పై చర్యలు తీసుకోవాలి



రైతు సంఘం నేతల నిరసన

రేపల్లె: రైతులను మోసం చేసిన రైస్ మిల్లర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట రామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు.. ఏపీ రైతు సంఘం, సీపీఎం సభ్యులు సోమవారం ఆర్డీఓ, తహసీల్దార్, డీఎస్పీ కార్యాలయాల్లో అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. 2018లో ధాన్యం కొనుగోలు చేసిన రైస్ మిల్లర్.. రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు. కస్తూరి రాధాకృష్ణమూర్తి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, సంవత్సరాలు గడుస్తున్న ప్పటికీ డబ్బులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాడని మండిపడ్డారు. సమస్యను పోలీస్, కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి పలు దఫాలు తీసుకెళ్లినా.. ఫలితం లేకపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్. మణిలాల్, రైతులు కె.కోటేశ్వరరావు, టి.నరసింహరావు, కె.మహేష్, వాసు, ఆర్.వెంకటేశ్వరరావు, కె.హనుమంత్, కౌలు రైతు సంఘాల నాయకులు బి.సుబ్బారావు, కె.ఆశీర్వాదం, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్..



వేమూరు: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసి, వారి నుంచి ద్విచక్ర వాహనాలు రికవరీ చేసినట్లు రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన వేమూరు పోలీసు స్టేషన్‌లో సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లాలో ద్విచక్ర వాహన చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలకు ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. వేమూరు మండలంలో బైక్ చోరీలు ఎక్కువ కావడంతో స్థానిక సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ చోడయ్య, క్రైమ్ సిబ్బంది నిందితుల కోసం జల్లెడపట్టినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం వరహాపురం క్రాస్ రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా.. వేమూరు సెంట్రల్ బ్యాంక్ వద్ద చోరీ చేసిన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని ఎస్ఐ తన సిబ్బందితో వెంబడించి పట్టుకున్నారని డీఎస్పీ తెలిపారు. వారిని విచారించగా 9 ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్టు ఒప్పుకున్నారని, ఆ బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితులు తెనాలి పట్టణం ఐతానగర్, జయప్రకాశ్ నగర్‌కు చెందిన చింత కోటేశ్వరరావు, వెలగదాసు ఫణీంద్రను సోమవారం తెనాలి కోర్టు హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు.